క్లుప్తంగా

చలో డిల్లీని జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: వివిధ రంగాల్లోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన చలో డిల్లీని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో యునైటెడ్‌ ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే విద్యుత్‌ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి రోజు కూలీ రూ. 600 ఇవ్వాలన్నారు. యునైటెడ్‌ఎలక్ట్రిసిటి కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు సురేష్‌బాబు, కొండారెడ్డి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న క్యాంపస్‌ ఇంటర్వ్యూలు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 31న టీం మెంబర్‌ ట్రైనీ ఉద్యోగాలకు క్యాంపస్‌ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ పి.సుబ్బలక్షుమ్మ తెలిపారు. మోండెల్జ్‌ ఇంటర్నేషనల్‌ కంపెనీకి చెందిన ప్రతినిధులు విచ్చేసి డిగ్రీ ఫైనలియర్‌ చదువుతున్న విద్యార్థినులు, 2022లో డిగ్రీ పాసైన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని తెలిపారు.

గెస్ట్‌ ఫ్యాకల్టీకి వాక్‌ ఇన్‌ ఇంటర్వ్యూ

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్‌ అండ్‌ ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ పి. సుబ్బలక్షుమ్మ తెలిపారు. డిగ్రీ, పీజీ విభాగాల్లో ఆంగ్ల మాధ్యమాల్లో బోధించేందుకు ఎంఎస్సీ జువాలజీలో కనీసం 60 శాతం ఉత్తీర్ణతతో పాటు ఏపీసెట్‌, నెట్‌, పీహెచ్‌డీ, కంప్యూటర్‌లో ఎంఎస్‌ ఆఫీస్‌ పరిజ్ఞానం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలోని జువాలజీ విభాగంలో నిర్వహించే ఇంటర్వ్యూ, డెమోకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు ఒరిజినల్‌ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్‌ టెస్ట్‌

కడప ఎడ్యుకేషన్‌ : కడప నగరం మున్సిపల్‌ హైస్కూల్‌ మెయిన్‌లో సోమవారం రెవల్యూషనరీ స్టూడెంట్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్‌ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా పరీక్షలను రాయాలన్నారు. ఈ మోడల్‌ టెస్టును ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఆర్‌ఎస్‌యూ నాయకులు హరి, సుకుమార్‌, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కడప కల్చరల్‌ : కడప నగర శివార్లలోని ఆంధ్రప్రదేశ్‌ ఉమెన్స్‌ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ పాఠశాలలో బాసట స్వచ్ఛంద సేవా సంస్థ సోమవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.బాసట సంస్థ సభ్యులు విజయ్‌ బుక్‌ స్టాల్‌ అధినేత నవీన్‌ విద్యార్థులకు అట్టలు, పెన్నులు, జామెట్రీ బాక్సులు తదితర పరీక్ష సామగ్రిని ఏర్పాటు చేశారు. బాసట ప్రతినిధులు ఎం బాలాజీరావు, డి ఏ.కార్తీక్‌రెడ్డి, వీ.సాత్విక్‌, శ్రీను, ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు హ్యూమన్‌రైట్స్‌పై ఒక్కరోజు శిక్షణ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం హ్యూమన్‌రైట్స్‌పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైవీయూ పొలిటికల్‌ సైన్స్‌ అండ్‌ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ విభాగాధిపతి డాక్టర్‌ జి.పార్వతి తెలిపారు. జాతీయ మానవహక్కుల కమిషన్‌, వైవీయూ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి వైవీయూ అధికారులతో పాటు నిపుణులు రీసోర్స్‌పర్సన్‌లుగా విచ్చేయనున్నట్లు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యా సామగ్రితో చిన్నారులు

కడప కల్చరల్‌ : గౌస్‌నగర్‌ మదరసా విద్యార్థులకు జిల్లా చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు విద్యా సామగ్రిని అందజేశారు. సోమవారం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పండ్రా రంజిత్‌ కుమార్‌ పర్యవేక్షణలో నిర్వహించిన ఈకార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సీఆర్‌ఐ సునీల్‌ జయంత్‌ ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో అభిమాన సంఘం ప్రతినిధులు వెంకట సురేంద్ర, సుధీర్‌ నాయక్‌, గోపాల్‌ నాయక్‌, జానీ, వెంకటేష్‌, మదరసా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల వారసత్వాన్ని కాపాడుకుందాం



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీన్‌, అధ్యాపకులు



కళాకారుడు గంగన్న దంపతులను సత్కరిస్తున్న అతిథులు

ప్రముఖ ఆడిటర్‌ ఖాసీంఖాన్‌

కడప కల్చరల్‌ : రంగస్థల వారసత్వాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉందని ప్రముఖ ఆడిటర్‌, విద్యావేత్త లయన్‌ పి.ఖాసీంఖాన్‌ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని సీపీ బ్రౌన్‌ గ్రంథాలయంలో శ్రీ వెంకటేశ్వర సాంస్కృతిక కళామండలి కార్యదర్శి మధుబాబు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు రాజ్యమేలిన రోజుల్లో రంగస్థలం నాటకం మందు లాగా పనిచేసిందన్నారు. రంగస్థలానికి జీవితాన్ని అంకితం చేసి కష్టాల్లో ఉన్న పేద, వృద్ధ కళాకారుల్లో ఏటా 5మందికి రూ.5వేల రూపాయల చొప్పున నగదు పురస్కారాలు ఇస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రంగస్థల దినోత్సవ నిర్వహణకు రూ.10వేల రూపాయలు విరాళం ఇచ్చారు. సభాధ్యక్షులు లయన్‌ మానస చిన్నపరెడ్డి, బీసీ సంక్షేమశాఖ



మాట్లాడుతున్న ఖాసీంఖాన్‌

అధికారి డాక్టర్‌ వి. బ్రహ్మయ్య, యోగి వేమన విశ్వవిద్యాలయం డీన్‌ ఆఫ్‌ ఆర్ట్స్‌ ఫ్యాకల్టీ ఆచార్య తప్పెట రామ ప్రసాదరెడ్డి, ప్రముఖ నాటక రచయిత పల్లేటి లక్ష్మి కులశేఖర్‌ మాట్లాడారు. హౌసింగ్‌ బోర్డు రామాలయం ధర్మకర్త డి. వెంకట రెడ్డి పలు నాటకాలలోని పద్యాలను ఆలపించి ఉర్రూతలూగించారు.

'మధు'రాలాపన

సభానంతరంనటుడు మధు ప్రధాన గాయకుడుగా 8 మంది కళాకారులు ఒక్కొక్క నాటకం నుంచి ఒక్కొక్క పద్యాన్ని కోరగా ఆయన తన మధుర గాత్రంతో పద్యాలు ఆలపించి పరవశింప చేశారు. అనంతరం ప్రముఖ రంగ స్థల కళాకారులను ఘనంగా సత్కరించారు.

వైవీయూలో..

వైవీయూ : నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగా విలసిల్లుతూ కాలక్రమేణా రూపం మార్చుకుంటూ విశ్వజనీనంగా నిలుస్తోందని వైవీయూ డీన్‌ ఆఫ్‌ ఆర్ట్స్‌ అండ్‌ హ్యూమానిటీస్‌ ఆచార్యులు తప్పెట రామప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం వైవీయూలో ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ప్రఖ్యాత నాటకకర్త బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లలితకళల విభాగాధిపతి కోటా మృత్యుంజయరావు, థియేటర్‌ ఆర్ట్స్‌ అధ్యాపకుడు డాక్టర్‌ కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి, అధ్యాపకుడు వి.సుధాకర్‌, లలితకళల విభాగం అధ్యాపకులు వెంకటేష్‌, బి.వీరప్ప, సి.హెచ్‌. అప్పలాచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

'పోలవరం' ఎత్తు తగ్గింపు సరికాదు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : జాతీయ హోదా కలిగిన పోలవరం ప్రాజెక్టు సామర్థ్యం తగ్గించే ఆలోచనను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్‌ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు పూర్తి కాకపోగా సామర్థ్యం తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టును 150 అడుగుల నుంచి 90 అడుగులకు కుదించడం వల్ల ప్రాజెక్టు నీటి సామర్థ్యం తగ్గిపోయి బ్యారేజీగా మారి రాష్ట్రంతో పాటు రాయలసీమ ప్రాంతం ఎక్కువగా నష్టపోతుందన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు ఎత్తును కుదించే ఆలోచనను ఉపసంహరించుకోవాలన్నారు. సీపీఐ నాయకులు నాగసుబ్బారెడ్డి, ఆంజనేయులు, బషీరున్నీషా, సుబ్రమణ్యం, వేణుగోపాల్‌, కెసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సీపీఐ నాయకులు

విద్యుత్‌ చార్జీల భారాలను ఉపసంహరించుకోవాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కేంద్ర ప్రభుత్వం అదనపు లోడు, పీక్‌ డిమాండు పేరుతో ప్రజలపై కొత్త తరహా విద్యుత్‌ భారాలను ఉపసహరించుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్‌ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

డిస్కంలు, గృహ, వాణిజ్యాలకు విద్యుత్‌ కనెక్షన్‌లు ఇచ్చేటప్పుడు వాడుకునే విద్యుత్‌ పరికరాల ఆధారంగా లోడ్‌ నిర్ణయిస్తారని తెలిపారు. ఏడాదిలో మూడు నెలలు వాడకం పెరిగితే పెరిగిన కేటగిరికి మార్చాలని ముసాయిదాలో తెలిపారన్నారు. లోడ్‌ పెరిగితే కేటగిరి మార్చాలన్న కేంద్రం లోడ్‌ తగ్గితే మినహాయింపులపై వెసులుబాటు కల్పించలేదని పేర్కొన్నారు. విద్యుత్‌ చార్జీల కొత్త తరహా భారాలు మోపేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలన్నారు. సీపీఎం నాయకులు చంద్రా రెడ్డి, ఎంఆర్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

'సిమ్లా' శిక్షణలో నగర కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్‌ : హిమాచల్‌ ప్రదేశ్‌ రాష్ట్ర రాజధాని సిమ్లాలో స్థానిక ప్రజాప్రతినిధులు విధులు, బాధ్యతలు, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి కడప నగరపాలక సంస్థకు చెందిన డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఆల్‌ ఇండియా ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ లోకల్‌ సెల్ఫ్‌ గవర్నమెంట్‌ వారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కడప నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌ బేగం, నిత్యానందరెడ్డి, ఏపీ పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు సభ్యుడు పాకా సురేష్‌ కుమార్‌, కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, షంషీర్‌, బాలస్వామిరెడ్డి, శిరీష, సుజాత, మేసా ప్రమీల రాణి, గంగాదేవి, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న కడప నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

ఎన్‌ఎస్‌ఎస్‌ శిబిరంలో రక్తనిర్ధారణ పరీక్షలు

వైవీయూ : కడప నగరం శివానందపురంలో కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ స్పెషల్‌ క్యాంపులో సోమవారం స్థానిక ప్రజలకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓ వై. సావిత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తగ్రూపులను తెలుసుకోవడం ద్వారా ఆపద సమయంలో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం పలువురికి రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.



రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓ వై. సావిత్రి, విద్యార్థులు

ఆధ్యాత్మికతే క్రమశిక్షణకు మూలం

చింతకొమ్మదిన్నె: ఆధ్యాత్మికతే క్రమశిక్షణకు మూ లం అని కడప ఆర్డీఓ ధర్మా చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొలుములపల్లి ఉన్నత పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆధ్యాత్మికత మంచి క్రమ శిక్షణ నేర్పుతుందన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఎస్‌ఎస్‌ఏ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌ రెడ్డి, ఎంపీడీఓ రవికుమార్‌ రెడ్డి పాల్గొన్నారు.



సరస్వతి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వరిగడ్డి దగ్ధం

చెన్నూరు: చెన్నూరు టౌన్‌ ప్రధాన రహదారి స్టేట్‌ బ్యాంకు సమీపంలో సోమవారం సాయంత్రం వరి గడ్డితో వెళుతున్న ట్రాక్టర్‌ ప్రమాదవశాత్తు విద్యుత్‌ వైర్లు తగిలి వరి గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరుకు చెందిన రైతు చల్ల బాల వీరారెడ్డి తమ పశువుల మేత కోసం మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో రూ.30 వేల రూపాయలకు వరి గడ్డిని కొనుగోలు చేశాడు. దానిని ట్రాక్టరు ద్వారా తమ పశువుల ఫాం వద్దకు తీసుకెళ్తుండగా చెన్నూరు ప్రధాన రహదారి స్టేట్‌ బ్యాంకు సమీపంలోకి రాగానే అక్కడ డ్రైనేజి పనుల నిమిత్తం తోలిన మట్టిని ట్రాక్టరు ఎక్కడంతో ప్రమాదవ శాత్తు విద్యుత్‌ వైర్లు వరి గడ్డికి అంటుకుని మంటలు వ్యాపించాయి. స్థానికులు తమ ఇళ్లలోని నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా మంటలు అదుపు కాకపోవడంతో కడప ఫైరింజన్‌కు సమా చారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వరిగడ్డి పూర్తిగా కాలిపోయింది.



మంటలను అదుపు చేస్తున్న ఫైరింజన్‌ సిబ్బంది

అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు

కడప అర్బన్‌ : కొండాయపల్లెలో ప్రభుత్వ పాఠశాల సమీపంలో శివానందపురానికి చెందిన ఈరి నరసింహులు అనే యువకుడు ఆ మార్గంలో వెళుతున్న మహిళలు, విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. తన ద్విచక్రవాహనంపైనే కూర్చుని వెకిలి చేష్టలకు పాల్పడుతూ, వచ్చే,పోయేవారిపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానిక బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలియజేశారు.

గిరి ప్రదక్షిణ కోసం ప్రచారం ప్రారంభం

కడప కల్చరల్‌: ఏప్రిల్‌లో పౌర్ణమి నాడు పుష్పగిరి క్షేత్రంలో నిర్వహించనున్న గిరి ప్రదక్షిణ కోసం భక్తులు ప్రచారం ప్రారంభించారు. పుష్పగిరి క్షేత్రధర్మ పరిరక్షణ సేన, శ్రీ జగన్మాత మారెమ్మ దేవాలయ కమిటీ సభ్యులు సోమవారం పుష్పగిరి క్షేత్రం పరిసర గ్రామాలలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.

నగర పరిధిలోని బుడ్డాయపల్లెలో ఇంటింటికి వెళ్లి గిరి ప్రదక్షిణ విశిష్టత గురించి వివరించారు. అనంతరం ఆలంకాన్‌ పల్లెలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు. గిరి ప్రదక్షిణ నిర్వహించే తేదీ, సమయం, నియమ నిబంధనలు గురించి వివరించారు. ధార్మిక సంస్థ ప్రతినిధులు సట్టి భారవి,సత్యనారాయణ గాంధీ, సునీల్‌, వరప్రసాద్‌, బాలకృష్ణ పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.3.75 లక్షలు

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయ హుండీ ఆదాయం రూ.3.75 లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో పి. సురేష్‌ కుమార్‌ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణంలో ఆలయ పర్యవేక్షణ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో జాతర, ఐదు వారాల జాతరతో పాటు ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ విశ్వనాథరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సామరస్యాన్ని పెంచే ఇఫ్తార్‌

కడప కల్చరల్‌: రంజాన్‌ మాసం సందర్భంగా నిర్వహించే ఇఫ్తార్‌ విందులు మానవుల మధ్య సామరస్యాన్ని పెంచుతాయని నగర ప్రముఖులు అహ్మద్‌ బాష అన్నారు. సోమవారం కడప నగరం కృష్ణా సర్కిల్‌ వద్ద గల షాహీ దర్బార్‌ హాలులో రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని ఎస్‌ఎండీ ఆజం ఆధ్వర్యంలో ఇఫ్తార్‌ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అహ్మద్‌బాషా హాజరై మాట్లాడుతూ పవిత్ర రంజాన్‌ మాసంలో ఉపవాసం చేస్తున్న వారికి ఇఫ్తార్‌ విందు ఇవ్వడం పుణ్యదాయకంగా భావిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలో తాగునీటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌ఎస్‌ ప్రవీణ్‌చంద్‌ ఆదేశించారు. సోమవారం ఉదయం పాత మున్సిపల్‌ కార్యాలయంలో ఆయన ఇంజినీరింగ్‌ అధికారులు, ఏఈలు, ఫిట్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలం ప్రారంభమైనందున తాగునీటి సమస్యలు ఏర్పడకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నీటి సరఫరాపై వస్తున్న ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలన్నారు. ప్రస్తుత రంజాన్‌ మాసంలో ఎక్కడా నీటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కమిషనర్‌ ప్రవీణ్‌చంద్‌ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్‌ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 54 అర్జీలు రాగా, అదులో ఇంజినీరింగ్‌ విభాగానికి సంబంధించి–16, టౌన్‌ప్లానింగ్‌–13, పబ్లిక్‌ హెల్త్‌–6, రెవెన్యూ విభాగం–7, యూపీఏ విభాగం –2, హౌసింగ్‌–5, ఆర్‌అండ్‌బి విభాగం–1, కడప తహసీల్దార్‌–3, ఏపీఎస్‌పీడీసీఎల్‌–1 వచ్చాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీపీ సంజీవ్‌ కుమార్‌, ఎస్‌ఈ రత్నాల రాజు, ఎంహెచ్‌ఓ ప్రశాంత్‌ వర్ధన్‌ తదితరులు పాల్గొన్నారు.



'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్‌ ప్రవీణ్‌చంద్‌

పదిలో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్‌ : రానున్న పదో తగరతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి సూచించారు. సోమవారం కడప కాగితాలపెంట ఉర్దూ జిల్లా పరిషత్తు హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను పరిశీలించడంతోపాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలంచారు. పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు అందరు ఉపాధ్యాయులు సమిష్టి కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి

కడప కోటిరెడ్డిసర్కిల్‌ : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి అన్నారు. కడప నగరంలోని జెడ్పీ ఆవరణలో కార్పెంటర్స్‌ డే సందర్భంగా కడప రోటరీ క్లబ్‌, సువర్ణ భారతి చారిటబుల్‌ ట్రస్ట్‌, అరుణాచల హాస్పిటల్‌ ఉమ్మడి ఆధ్వర్యంలో కార్పెంటర్లకు ఉచిత మధుమేహం, రక్తపోటు పరీక్షలతో పాటు, ఈసీజీ, ఎకో తదితర పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రతి మూడునెలలకొకసారి మధుమేహం, రక్తపోటు పరీక్షలను తప్పక చేయించుకోవాలన్నారు. డాక్టర్‌ వారణాశి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ క్రమం తప్పక వ్యాయామంతో పాటు ఒత్తిడిలేని జీవితం, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ శిబిరంలో 235 మందికి పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్‌ అధ్యక్షుడు నితీష్‌రెడ్డి, కార్యదర్శి సమరనాథ్‌ రెడ్డి, సభ్యులు శివరాంరెడ్డి, సుధీర్‌, తాజుద్దీన్‌, చెన్న కృష్ణారెడ్డి, అరుణాచల హాస్పిటల్‌ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్‌ ఆకేపాటి అమర్‌నాథ్‌ రెడ్డి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కడప కోటిరెడ్డి సర్కిల్‌ : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రేణుక, పీహెచ్‌సీ డాక్టర్‌ హైమవతి అన్నారు. సోమవారం నిరంజన్‌నగర్‌ ప్రాథమిక పాఠశాలలో కిశోరి బాలికలకు చిరుధాన్యాలు, అనీమియా తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ రక్తహీనత బారిన పడకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. స్కూల్‌ ప్రధానోపాధ్యాయురాలు క్రిష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు కౌసల్య, ఎలిజబెత్‌, ఇందిరా, నిర్మల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ రేణుక

ఎమ్మెల్యే శ్రీదేవి దళితులకు క్షమాపణ చెప్పాలి

ఏపీ సోషల్‌ వెల్ఫేర్‌ బోర్డు చైర్మన్‌ పులి సునీల్‌ కుమార్‌

కడప కార్పొరేషన్‌: తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి దళితులకు క్షమాపణ చెప్పాలని ఏపీ సోషల్‌ వెల్ఫేర్‌ బోర్డు చైర్మెన్‌ పులి సునీల్‌ కుమార్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బీ ఫారంతో ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీదేవి ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దేశ చరిత్రలో ఎస్సీ, ఎస్టీలకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు ఎవరూ చేయలేదన్నారు. సొంత పార్టీకి వెన్నుపోటు పొడిచి తీరని ద్రోహం చేసిన ఉండవల్లి శ్రీదేవి, దళితురాలిననే ఇలా చేస్తున్నారని మాట్లాడటం తగదన్నారు. సజ్జల నుంచి ప్రాణహాని ఉందని శ్రీదేవి చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. నేషనల్‌ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని శ్రీదేవి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ వినోద్‌ కుమార్‌, పార్టీ నాయకులు త్యాగరాజు, పి. సంపత్‌ కుమార్‌, లక్ష్మి నారాయణ, సీహెచ్‌ సునీల్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పులి సునీల్‌ కుమార్‌

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

చెన్నూరు : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శివాల్‌పల్లె గ్రామ పంచాయతీలో రూ.57లక్షల (ఏపీపీఆర్‌) నిధులతో శివాల్‌పల్లె హరిజనవాడ నుండి శివాల్‌పల్లె మెయిన్‌ రోడ్డు వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఆయన తనయుడు, చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్‌ రామాంజనేయరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో 19వర్క్‌ ప్యాకేజీల కింద కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. చెన్నూరు మండలంలో ఈ నిధుల ద్వారా రెండు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటికే మండలంలోని బలిసింగాయపల్లెలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ సుదర్శన్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ రామసుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆర్‌ఎస్‌ఆర్‌ (చిన్నా), వైఎస్సార్‌సీపీ సీనియర్‌ నాయకులు పుల్లయ్య యాదవ్‌, జెడ్పీటీసీ దిలీప్‌రెడ్డి, ఎంపీపీ సురేష్‌ యాదవ్‌, అటవీ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌ శ్రీలక్ష్మి, కొండపేట సర్పంచ్‌ చంద్రశేఖర యాదవ్‌, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మోహన్‌ రెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, తదితరులు

మహిళలను లక్షాధికారులను చేయాలన్నదే సీఎం లక్ష్యం..

పెండ్లిమర్రి: డ్వాక్రా అక్కచెల్లెమ్మలను లక్షాధికారులను చేయాలన్నదే సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెండ్లిమర్రి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్‌ ఆసరా కింద 811 స్వయం సహాయ సంఘాలకు రూ.7.70 కోట్ల మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆకుటుంబం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌ మహిళలు అన్నిరంగాల్లో ముందు ఉండాలని మహిళలకు పెద్ద పీట వేశారన్నారు. గత ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని గుర్తుచేశారు. ఇంత ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటున్న సీఎం జగన్‌ను గుర్తుపెట్టుకొని ఆదరించాలన్నారు. సీకే దిన్నె జెడ్పీటీసీ పి.నరేన్‌ రామాంజులరెడ్డి మాట్లాడారు. అనంతరం డ్వాక్రా మహిళలు సీఎం జగన్‌ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కేక్‌ కట్‌ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌ ఆనంద్‌ నాయక్‌, జెడ్పీ వైస్‌ చైర్మన్‌ బాలయ్య, ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్‌ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్‌ నాగమల్లారెడ్డి, తహశీల్దార్‌ ఉదయ భాస్కర్‌ రాజు, ఎంపీడీఓ అల్తాఫ్‌ హుస్సేన్‌ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె: మండలంలోని అంకిరెడ్డిపల్లె, వెల్దుర్తి గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్‌ రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్‌ డైరెక్టర్‌ వీరప్రతాపురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకుడు నరేన్‌రామాంజుల్‌రెడ్డి హాజరు కానున్నట్లు వారు తెలియజేశారు.